రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 287 | శనివారం | 11-04-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

ఇస్లామాబాద్‌లో నేడు శాంతి చర్చలు

భద్రత కట్టుదిట్టం.. 'రెడ్‌జోన్' మూసివేత

ఇస్లామాబాద్: అమెరికా–ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో శనివారం శాంతి చర్చలు జరగనున్న పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భద్రతను కట్టు దిట్టం చేశారు. ఏప్రిల్ 11న చర్చలు జరగనుండగా పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. ఇస్లామాబాద్‌లో దేశ పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. ఈ చర్చల నేపథ్యంలో గురువారం, శుక్రవారం ఇస్లామాబాద్‌లో సెలవు ప్రకటించారు. దుకాణాలు మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే రెండు వారాల పాటు కాల్పుల విరమణ జరిగిందని చెప్పిన పాకిస్థాన్... ఇప్పుడు ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతత్వంలోని బందం అమెరికా తరఫున చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాక్ బయల్దేరారంటూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. వారిద్దరూ తమ రాజధాని తెహ్రాన్‌లోనే ఉన్నారని చెప్పింది. ఒకవేళ చర్చలంటూ జరిగితే... హ్రోర్మజ్‌పై నియంత్రణ, తమ దేశంపై ఉన్న ఆంక్షల నుంచి ఉపశమనం, తన మిత్ర పక్షాలపై దాడులు చేయకూడదంటూ తరువాయి 2లో

లెబనాన్‌పై దాడులు ఆందోళనకరం: భారత్

న్యూఢిల్లీ : లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరుపుతున్న వైమానిక దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో పౌరులు మరణించినట్టు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఉద్రిక్తతలు తగ్గించి సంయమం పాటించాలని కోరింది. అంతర్జాతీయ చట్టాల గౌరవం, పౌరుల రక్షణ అత్యంత ముఖ్యమని స్పష్టం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన ప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు కొనసాగిస్తోంది. లెబనాన్ ఈ ఒప్పందం పరిధిలోకి రాదని ఇజ్రాయిల్ వాదిస్తోంది. లెబనాన్‌పై దాడులు ఆపకుంటే అమెరికాతో శాంతి చర్చల నుంచి వైదొలుగుతామని తరువాయి 2లో

పైకి శాంతి చర్చలు...

లోపల విద్వేషం

పాకిస్థాన్‌పై ఇజ్రాయెల్ ఆగ్రహం

ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై తీవ్ర నిరసన

పాక్ మధ్యవర్తి పాత్రపై సందేహాలు

లెబనాన్‌తో చర్చలకు నెతన్యాహు ఆదేశం

02

ప్రతిపాదిత నియోజకవర్గాల

పునర్విభజనతో తీవ్ర పరిణామాలు

రాజకీయ లబ్ధి కోసం ఎన్నికల సమయంలో మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ

ఇది ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘనే

దీనిపై ఇతర ప్రతిపక్షాలతో కలిసి ఉమ్మడి వ్యూహం రచిస్తాం

సిడబ్ల్యూసి సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే

న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుకు సంబంధించి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని, దీనిపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఈ విషయంలో ఐక్యంగా ముందుకు సాగేందుకు ప్రతిపక్షంలోని ఇతర పార్టీలతో కలిసి తమ పార్టీ ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందిస్తుందని తెలిపారు. కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే ఏకైక ఉద్దేశంతోనే మోదీ ప్రభుత్వం ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ సమావేశాలను నిర్వహిస్తోందని, ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనే అని, అలాగే రాజ్యాంగ సవరణ బిల్లును అత్యంత తొందరపాటుతో ఆమోదింపజేయాలని చూస్తోందని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని సవరించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై చర్చించేందుకు శుక్రవారం ఢిల్లీలో మల్లిఖార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యూసి) సమావేశానికి ఎఐసిసి మాజీ అధినేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, కె.సి.వేణుగోపాల్, జైరామ్ రమేశ్, సచిన్ పైలట్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జీత్ సింగ్ చన్నీ,లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్, మాజీ కేంద్ర మంత్రులు అంబికా సోని, ఆనంద్ శర్మ తరువాయి 2లో

భూమిపైకి ఆర్టెమిస్

ఆర్టెమిస్ II వ్యోమనౌక నేడు ఉదయం 5:37 గంటలకు కాలిఫోర్నియాలోని శాన్ డియాగో తీరానికి దూరంగా పసిఫిక్ మహాసముద్రంలో భూమిపై దిగుతుంది. ఏప్రిల్ 2న ప్రయోగించిన ఆర్టెమిస్ II, అపోలో 17 తర్వాత భూమి సమీప కక్ష్యను దాటి నలుగురు వ్యోమగాములతో కూడిన మొదటి యాత్రను పంపి, నాసాకు ఒక ప్రధాన మైలురాయిగా నిలిచింది. భవిష్యత్ చంద్ర అన్వేషణ కోసం కీలకమైన వ్యవస్థలను మూల్యాంకనం చేయడంపై దృష్టి సారించి, చివరికి అంగారకుడికి మానవ యాత్రలకు పునాది వేయడంలో సహాయపడటానికి ఇది రూపొందించబడింది.

జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ ఎట్టకేలకు రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపించారు. గతంలో దిల్లీలోని తన నివాసంలో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగించేందుకు అభిశంసన ప్రక్రియకు ప్రయత్నాలు జరుగుతున్న వేళ... తాజా పరిణామం చోటుచేసుకుంది. దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆ మంటలు ఆర్పేందుకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది కాలిపోయిన నోట్ల కట్టలు గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా... అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో కమిటీ వేశారు. నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని ఆ కమిటీ తేల్చింది. దీంతో రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ వర్మకు సీజేఐ సూచించగా... అందుకు ఆయన తిరస్కరించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తాను గానీ, తన కుటుంబం గానీ ఎప్పుడూ తమ ఇంటి స్టోర్ రూమ్‌లో నగదు దాచిపెట్టలేదని చెప్పారు. ఆ గదిలోకి ఎవరైనా వెళ్లడానికి వీలు ఉందన్నారు. విచారణ కమిటీ ఇచ్చిన దర్యాప్తు నివేదికను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అయితే అత్యున్నత న్యాయస్థానంలోను ఆయనకు ఊరట దక్కలేదు. సుప్రీం ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది. అభిశంసనకు సిఫారసు చేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీకి సుప్రీం ప్రధాన న్యాయమూర్తి లేఖలు రాశారు. జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయసభల్లో ఎంపీలు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ రాజీనామాతో అభిశంసన ప్రక్రియ ముగిసిపోతుందని లోక్‌సభ సెక్రటేరియట్ వర్గాలు మీడియాకు వెల్లడించాయి.

'మీసేవ వాట్సాప్' ద్వారా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ సేవలు

ప్రజాపక్షం/హైదరాబాద్

డిజిటిల్ సేవల్లో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్, స్టాంప్స్ విభాగం (ఐజిఆర్ఎస్) సేవలను వాట్సాప్ ద్వారా మొబైల్ ఫోన్‌లో పొందే అవకాశం అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఎక్కడ నుంచైనా భూమి సంబంధిత వివరాలను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ప్రభుత్వ సేవలన్నీ డిజిటల్ రూపంలో సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు 2025 నవంబర్ 18వ తేదీన ప్రారంభమైన మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ సేవలు రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందాయి. మీసేవ వాట్సాప్ నంబర్ 8096958096 ద్వారా రిజిస్ట్రేషన్ పత్రం సర్టిఫైడ్ కాపీ, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్, స్టాంప్‌ల కొనుగోలు, ఫ్రాంకింగ్, డెఫిసిట్, సొసైటీలు, సమాచార హక్కు దరఖాస్తు (ఆర్‌టిఐ), ఫర్మ్‌లు,అపరాధ రుసుం చెల్లింపు అందుబాటులో ఉన్నాయని మీసేవ కమిషనర్ టి.రవికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 8096958096 నంబర్‌ను మీ ఫోన్‌లో సేవ్ చేసుకుని, వాట్సాప్ తెరిచి 'హాయ్' అని మెస్సేజ్ పంపించాలి. తర్వాత కావలసిన సేవ పేరు టైప్ చేసి, ఫామ్ నింపి, ఆన్‌లైన్‌లో చెల్లింపు పూర్తి చేయొచ్చు. పెనాల్టీ, డెఫిసిట్, స్టాంప్స్ వంటి సేవల విషయంలో చెల్లింపు తర్వాత సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పత్రాలు స్వీకరించవచ్చు. ఇసి మీసేవ తరువాయి 2లో

నిరంతర పన్నుల పర్యవేక్షణతో

ఆదాయం పెరిగింది

మరింత పకడ్బందీగా ఇసుక, క్రషర్ మైనింగ్ విభాగాల్లో అక్రమ రవాణ, ఓవర్ లోడ్ వంటి అంశాల్లో చర్యలు చేపట్టాలి

ఎఐ టెక్నాలజీ వినియోగంతో మైనింగ్, రవాణా శాఖల్లో ఆదాయ వనరులను పెంచుకున్నాం

ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా రెవెన్యూ జనరేషన్, రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తాం

కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

భూ విక్రయాలపై ప్రపంచ స్థాయిలో ప్రచారం చేపట్టాలి: మంత్రి ఉత్తమ్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎఐ వంటి ఆధునిక టెక్నాలజీ వినియోగం, నిరంతర పన్నుల పర్యవేక్షణ ద్వారా వివిధ శాఖలలో ఆదాయం పెరిగిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నిరంతరం సమీక్షలు, పన్నుల నిర్వహణలో పకడ్బందీ చర్యలతో వాణిజ్య పన్నుల శాఖలో గత మూడు నెలలుగా జిఎస్‌టి ఆదాయం 15 శాతం పెరిగిందన్నారు. అధికారులు మరింత పకడ్బందీగా పని చేసి ఇసుక, క్రషర్ మైనింగ్ విభాగాల్లో అక్రమ రవాణ, ఓవర్ లోడ్ వంటి అంశాల్లో పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. 'రెవెన్యూ జనరేషన్, రిసోర్స్ మొబిలైజేషన్' మంత్రివర్గ ఉప సంఘం సమావేశం భట్టి విక్రమార్క అధ్యక్షతన హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశంలో ఉప సంఘం సభ్యులు, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎఐ టెక్నాలజీ వినియోగంతో మైనింగ్, రవాణా శాఖల్లో ఆదాయ వనరులను పెంచుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో కూడా ఆదాయంలో పెరుగుదల కనిపించిందని, ఆదాయం పెంచుకునేందుకు ప్రతి శుక్రవారం రెవెన్యూ జనరేషన్, రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం క్రమం తప్పకుండా నిర్వహిస్తామని వివరించారు. 2047 వరకు త్రి ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకున్నామని, ఇందుకు అనుగుణంగా అన్ని శాఖలు ఆదాయ సమీకరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను డిప్యూటీ ఆదేశించారు. భూముల విలువ పెంపునకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన వివిధ కమిటీల అధ్యయం పూర్తయిందని, ఆ కమిటీల నివేదికలను ముందుగా సబ్ కమిటీకి సమర్పించి, ఆ తర్వాత క్యాబినెట్‌కు నివేదించేందుకు అవసరమైన చర్యలు తరువాయి 2లో

ఆర్టిజన్ కార్మికులను

బెదిరించడం మంచిది కాదు

వారి న్యాయమైన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి

ప్రభుత్వానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

'ఎస్మా, డిస్మిస్, మెమో' పేరుతో విద్యుత్ శాఖలో సమ్మె చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను బెదిరించడం మంచిది కాదని, వారి న్యాయమైన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి కూనంనేని సాంబశివ రావు శుక్రవారం లేఖ రాశారు. ఆ లేఖ ప్రతులను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, జెన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఎన్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఎస్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపించారు. రాష్ట్రంలోని విద్యుత్ రంగంలో తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎన్‌పిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ ఇతర విభాగాల్లో 18 వేల మందికి పైగా ఆర్టిజన్లుగా పని చేస్తున్నారని వివరించారు. వారు తమ సమస్యల పరిష్కారానికి చట్టబద్ధంగానే సమ్మె నోటీసు ఇచ్చారని, అధికారులు స్పందిచకపోవడంతోనే , గత మూడు రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధికంగా సమ్మె చేస్తున్నారని ఆ లేఖలో కూనంనేని సాంబశివ రావు వివరించారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేయకుండా, వారి న్యాయమైన సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించాలని సూచించారు. గత ప్రభుత్వం ఆర్టిజన్ అనే పేరుతో కార్మికులను శ్రమ దోపిడీ పాల్పడే విధంగా చట్టం చేసిందని పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఆర్టిజన్లకు వేతనాలను, పదోన్నతులను కల్పించకుండా, విద్యార్హతను బట్టి సమూచిత స్థానం ఇవ్వలేదని, తద్వారా వారు ఎదుగు బొదుగు లేకుండా ఉన్న స్థానంలోనే ఉన్నారన్నారు. కష్టపడుతున్న వారికి వేతనాలు, పదోన్నతులు కల్పించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన వివరించారు. వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో కార్మికుల సమ్మెలో ఉంటే ఉత్పత్తి పై ప్రభావం పడుతున్నదని తెలిపారు. ఇప్పటికైనా పట్టింపులకు పోకుండా ఆర్టిజెన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను విరమింపచేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు.

42 మంది మావోయిస్టులు

లొంగుబాటు

మావోయిస్టు రహిత తెలంగాణగా ప్రకటించేశాం : డిజిపి శివధర్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని మావోయిస్టు రహితగా ప్రకటించేశామని డిజిపి బి.శివధర్‌రెడ్డి తెలిపారు. 42 మంది సిపిఐ (మావోయిస్టు) నేతలు ఆయుధాలతో సహా జనజీవన స్రవంతిలోకి చేరినట్లు ఆయన ప్రకటించారు. వీరిలో పిఎల్‌జిఎ బెటాలియన్ కమాండర్ స్థాయి నేతలతో పాటు డివిజనల్ కమిటీ సభ్యులు కూడా ఉండటం విశేషం. లొంగిపోయిన తరువాయి 2లో

ఆడ పిల్లలకు జన్మనిస్తుందనే సాకుతో

భార్య, ఇద్దరు పిల్లల హత్య

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలంగా మారిన భార్య ఇద్దరు బాలికల హత్యకు సంబంధించి కేసులో హత్య గురైన మృతురాలి భర్తతో పాటు ఈ హత్యలకు పరోక్షంగా కారణంగా నిలిచిన మరో మరో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ప్రధాన నిందితుడు వరంగల్ జిల్లా, పున్నెలు గ్రామానికి చెందిన యం.డి అజారుద్దీన్ (29)తో పాటు, నిందితుడి కుటుంబ సభ్యులు పున్నెలు గ్రామానికి చెందిన యం.డి చాంద్‌పాషా (49),యం.డి సలీహా (45), ఎం.షరోద్దీన్ (25)లతో పాటు బసిక స్రవంతి(32), కడిపికొండ, బాల్నె పార్థ (47) నెక్కొండ, తరువాయి 2లో

ఆర్‌టిసి ఉద్యోగులకు

2.1 శాతం డిఏ పెంపు

కార్మికుల సంక్షేమమే ధ్యేయం: మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యాన్ని ప్రకటించింది. ఈ ఏడాదిలో సంస్థ ఉద్యోగులకు జనవరిలో ఇవ్వాల్సిన డిఏను అందజేస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శుక్రవారం సంస్థ వైస్ ఛైర్మన్, ఎండి వై. నాగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 38 వేల మందికి పైగా తరువాయి 2లో

కెసిఆర్‌తో జీవన్‌రెడ్డి భేటీ

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్

ఇటీవల అధికార కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఎర్రవల్లి ఫాంహౌస్‌లో మాజీ సిఎం కెసిఆర్‌తో భేటీ అయ్యారు. శుక్రవారం తన అనుచరులతో ఫాంహౌస్‌కు చేరుకున్న తరువాయి 2లో